నమస్తే తెలంగాణ

# హైదరాబాద్

హైదరాబాద్- మేడ్చల్

I | హైదరాబాద్, ఆదివారం 18 ఆగస్టు 2024 | HYDERABAD




మణికొండ మర్రిచెట్టు వద్ద కేటీఆర్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు

## కేటీఆర్ చిత్రపటానికి క్షీరాభిషేకం

### సలహా ఇచ్చినా తప్పేనా..?

కాంగ్రెస్ సర్కారుపై బీఆర్ఎస్ నేతల మండిపాటు

మణికొండ, ఆగస్టు 17 : హైదరాబాద్‌ను ఐటీ హబ్‌గా తీర్చిదిద్దిన కేటీఆర్..నిద్రపోతున్న కాంగ్రెస్ ప్రభుత్వానికి అమూల్యమైన సలహాగా బస్సుల్లో సీట్లు పెంపు చేయమన్నారని, పొరపాటున మహిళల ఉచిత బస్సు ప్రయాణంపై అన్న చిన్నపాటి మాటకు మహిళా కమిషన్ స్పందించి నోటీసులు ఇవ్వడం హేయమైన చర్య అని మణికొండ బీఆర్ఎస్ నాయకులు తీవ్రంగా ఖండించారు. మానవతావాదిగా మహిళలకు క్షమాపణలు చెప్పినా.. రాజకీయ రంగులు పూసి.. కాంగ్రెస్ నేతలు అబద్ధాలతో పూట గడుపుకొంటున్నారన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వానికి సలహాలు ఇచ్చినా తప్పే అయిపోతున్నదన్నారు. కాగా, మణికొండ బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు మర్రిచెట్టు వద్ద కేటీఆర్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. ఈ కార్యక్రమంలో మణికొండ మున్సిపాలిటీ బీఆర్ఎస్ పార్టీ మహిళా అధ్యక్షురాలు రూపారెడ్డి, విజయలక్ష్మి, లతాగౌడ్, అందె లక్ష్మణ్‌రావు, రాజేంద్రప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.


ఇందిరాపార్క్ ధర్నాచౌక్ వద్ద నిరసన తెలుపుతున్న వైద్యులు

## వైద్యుల నిరసనలతో హోరెత్తిన నగరం




సిటీబ్యూరో, ఆగస్టు 17 (నమస్తే తెలంగాణ): పశ్చిమ బెంగాల్‌లో జూనియర్ డాక్టర్‌పై హత్యాచార ఘటనను నిరసిస్తూ.. గ్రేటర్‌లోని ప్రభుత్వ, ప్రైవేటు వైద్యులు శనివారం ఓపీ సేవలను బహిష్కరించారు. ర్యాలీలు, రాస్తారోకోలు, ధర్నాలతో హోరెత్తించారు. ఇందిరాపార్క్ ధర్నాచౌక్ వద్ద నిరసన తెలిపారు. పలువురు ప్రజాప్రతినిధులు, వివిధ సంఘాల నాయకులు వైద్యుల ఆందోళనకు మద్దతు తెలిపారు. నిందితులను వెంటనే గుర్తించి కఠినంగా శిక్షించాలని, భవిష్యత్‌లో వైద్యులపై దాడులు, అఘాయిత్యాలు వంటివి జరగకుండా తగిన భద్రత కల్పించాలని పలువురు డాక్టర్లు డిమాండ్ చేశారు.

### ఆటోను ఢీకొట్టిన లారీ

## పదో తరగతి విద్యార్థిని దుర్మరణం

ఉస్మానియా యూనివర్సిటీ, ఆగస్టు 17: హబ్సిగూడలో ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. వేగంగా దూసుకొచ్చిన లారీ..ఆగి ఉన్న ఆటోను ఢీకొట్టడంతో పదో తరగతి విద్యార్థిని దుర్మరణం పాలైంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. తార్నాకలోని కిమ్టీ కాలనీలో నివాసముండే రంగ గోపీనాథ్‌గౌడ్ కూతురు సాత్విక (15) హబ్సిగూడలోని గౌతమ్ మోడల్ స్కూల్‌లో పదో తరగతి చదువుతున్నది. శనివారం రోజు మాదిరిగానే ఆటోలో పాఠశాలకు బయలుదేరింది. హబ్సిగూడ సిగ్నల్ సమీపిస్తుండగా, ముందు ఉన్న బస్సు నిలిపివేయడంతో దాని వెనకాలే డ్రైవర్ ఆటోను ఆపాడు. అంతలోనే వేగంగా వచ్చిన లారీ ఆటోను ఢీకొట్టింది. దీంతో ఆటో బస్సు కిందకు దూసుకుపోయింది. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనాస్థలికి చేరుకొని క్రేన్ సహాయంతో ఆటోను బయటకు తీశారు. అందులో ఉన్న సాత్విక, డ్రైవర్ ఎల్లయ్యను సమీపంలోని ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ సాత్విక చనిపోయింది.


రంగ సాత్విక (ఫైల్)

### అండగా నిలువాలి: రాష్ట్ర ఆటో యూనియన్ అధ్యక్షుడు వేముల మారయ్య



హబ్సిగూడ ప్రమాదంలో గాయపడి చికిత్స పొందుతున్న ఆటో డ్రైవర్‌ను రాష్ట్ర ఆటో యూనియన్ అధ్యక్షుడు వేముల మారయ్య పరామర్శించారు. అనుమతి లేకుండా నగరంలోకి ప్రవేశిస్తున్న భారీ వాహనాలపై పోలీసులు చర్యలు తీసుకోవాలన్నారు. మృతిచెందిన విద్యార్థిని కుటుంబానికి ప్రభుత్వం అండగా నిలవాలని డిమాండ్ చేశారు.

### హోం మంత్రిని నియమించాలి: బీఎస్ఎం ఆటో రవాణా సంఘం

ప్రత్యేకంగా హోం మంత్రిని నియమించకపోవడంతో పోలీసుల్లో నిర్లక్ష్యం ఏర్పడిందని బీఎస్ఎం ఆటో రవాణా సంఘం నాయకులు రవిశంకర్ ఆరోపించారు. భారీ వాహనాలకు స్కూల్ వేళల్లో హైదరాబాద్‌లో అనుమతి లేదన్నారు. ట్రక్ ఓనర్‌పై చట్టపరంగా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. విద్యార్థిని, ఆటోడ్రైవర్ కుటుంబాలను ఆర్థికంగా ఆదుకోవాలని కోరారు.




## మన మెట్రోకు మొండిచెయ్యి

- బెంగళూరు మెట్రో ఫేజ్- 3కు భారీగా కేటాయింపులు
- పదేండ్లుగా మెట్రో ప్రాజెక్టులపై శీతకన్ను
- అభివృద్ధికి సహకరించకపోవడంపై నగరవాసుల ఆగ్రహం

### బడేబాయి చిన్నచూపు • నోరు మెదపని సీఎం రేవంత్

*దేశంలో ప్రధాన మెట్రో నగరాల్లో ఒకటిగా ఉన్న హైదరాబాద్ మహానగరంపై గత పదేండ్లుగా కేంద్రం చిన్న చూపు చూస్తున్నది. ఇటీవల ప్రవేశపెట్టిన బడ్జెట్‌లోనూ నిధులు ఇవ్వకపోగా, తాజాగా జరిగిన కేంద్ర కేబినెట్ సమావేశంలోనూ మెట్రో రైలు విషయంలో తెలంగాణకు మొండిచెయ్యి చూపింది. హైదరాబాద్‌ను విస్మరించి.. దేశంలోని మూడు మెట్రో రైలు ప్రాజెక్టులకు భారీగా నిధులు కేటాయించింది. మరీ ప్రధాని మోదీ 'నా బడే బాయి' అని చెప్పుకునే చోటే బాయి(సీఎం రేవంత్‌రెడ్డి) ఈ విషయంలో ఒక్కమాట కూడా మాట్లాడకపోవడం ఏమిటని నగరవాసులు ప్రశ్నిస్తున్నారు. తెలంగాణ నుంచి 8 మంది బీజేపీ ఎంపీలు ప్రాతినిధ్యం వహిస్తున్నా.. కేంద్రం రాష్ట్ర అభివృద్ధికి సహకరించకపోవడంపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.*

*-సిటీబ్యూరో, ఆగస్టు 17 (నమస్తేతెలంగాణ)*

**ఇటీవల ప్రవేశ పెట్టిన** కేంద్ర బడ్జెట్‌లో రాష్ట్రానికి నిధులు ఇవ్వని కేంద్ర ప్రభుత్వం..శుక్రవారం జరిగిన కేంద్ర కేబినెట్ సమావేశంలోనూ దేశంలోని మూడు మెట్రో రైలు ప్రాజెక్టులకు భారీగా నిధులను కేటాయిస్తూ నిర్ణయం తీసుకుంది. వేగంగా అభివృద్ధి చెందుతున్న మెట్రో నగరాల్లో ఒకటైన హైదరాబాద్‌పై మాత్రం కేంద్రం చిన్న చూపు చూస్తున్నదనడానికి ఇదే ప్రత్యక్ష నిదర్శనం. నగరంలో మెట్రో రెండో దశ పనుల కోసం గత బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రతిపాదనలు పంపినా పట్టించుకోలేదు. తాజాగా సీఎం రేవంత్‌రెడ్డి మెట్రో రెండో దశ ప్రాజెక్టుల విషయాన్ని కేంద్రం ముందు ఉంచినా.. గుండు సున్నాయే చూపడం గమనార్హం.

#### ఎన్నికలకు ముందు మహారాష్ట్రకు వరాలు..

మహారాష్ట్రలో ప్రస్తుతం బీజేపీ మద్దతుతో కూడిన ప్రభుత్వం అధికారంలో ఉంది. త్వరలోనే అసెంబ్లీ ఎన్నికలు జరగాల్సి ఉన్న నేపథ్యంలోనే అక్కడ రెండు మెట్రో రైలు ప్రాజెక్టులకు కేంద్ర కేబినెట్ నిధులు కేటాయించేందుకు ఆమోదం తెలిపింది. ఇందులో థానే ఇంటిగ్రల్ రింగ్ మెట్రో రైల్ ప్రాజెక్టుకు రూ.12200.00 కోట్లు, పుణె మెట్రో రైలు ప్రాజెక్టు కోసం రూ. 2954.53 కోట్లు కేటాయించింది. వీటికి తోడు తెలంగాణ పక్కనే ఉన్న కర్ణాటక రాష్ట్రానికి సంబంధించి బెంగళూరు మెట్రో రైలు ప్రాజెక్టు ఫేజ్-3 కోసం రూ.15,611 కోట్లకు కేంద్ర కేబినెట్ ఆమోదం తెలిపింది. ఇలా తెలంగాణకు ఇరువైపులా ఉన్న రెండు రాష్ట్రాల్లోని మూడు మెట్రో రైలు ప్రాజెక్టులకు ఒకేసారి మొత్తం రూ.30,765 కోట్లకు ఆమోదం తెలిపింది. కానీ హైదరాబాద్ మెట్రో రైలు ప్రాజెక్టులకు మాత్రం కేంద్ర ప్రభుత్వం పదేండ్లుగా మొండిచెయ్యి చూపుతూనే ఉన్నది.

#### బీహెచ్ఈఎల్ -లక్డీకాపూల్ ప్రతిపాదనలు..

హైదరాబాద్ నగరంలో గత బీఆర్ఎస్ ప్రభుత్వం బీహెచ్ఈఎల్-లక్డీకాపూల్ మెట్రో ప్రాజెక్టుకు సంబంధించిన పూర్తి వివరాలను కేంద్రానికి సమర్పించింది. 23 కి.మీ మేర నిర్మించే ఈ మార్గానికి సుమారు రూ.8500 కోట్ల వ్యయం అవుతుందని, దీనికి ఆమోదం తెలిపి నిధులు కేటాయించాలని కోరినా.. నరేంద్ర మోదీ ప్రభుత్వం అసలు పట్టించుకోలేదు. తెలంగాణలో కొత్తగా ఏర్పడిన కాంగ్రెస్ ప్రభుత్వంలో సీఎం రేవంత్ రెడ్డి హైదరాబాద్ మెట్రో రెండో దశ నిర్మాణానికి కేంద్రం సహకరించాలని అనేకసార్లు స్వయంగా కలిసి విజ్ఞప్తి చేశారు. అయినా హైదరాబాద్ మెట్రో పేరు ఎత్తలేదు. తెలంగాణ నుంచి 8 మంది బీజేపీ ఎంపీలు ఉన్నా.. రాష్ట్ర అభివృద్ధి పట్ల కేంద్రం ఏమాత్రం సహకరించడం లేదనే విమర్శలున్నాయి.

#### కేంద్ర కేబినెట్‌లో ఆమోదం పొందిన మెట్రో ప్రాజెక్టులు

- థానే ఇంటిగ్రల్ రింగ్ మెట్రో రైల్ ప్రాజెక్టుకు రూ.12200.00 కోట్లు
- పుణె మెట్రో మెట్రో రైలు ప్రాజెక్టు కోసం రూ.2954.53 కోట్లు.
- బెంగళూరు మెట్రో రైలు ప్రాజెక్టు ఫేజ్-3 కోసం రూ.15,611 కోట్లు.
- కర్ణాటక, మహారాష్ట్రలోని మెట్రో రైలు ప్రాజెక్టుల కోసం కేంద్ర కేబినెట్ మొత్తం రూ.30,765 కోట్లకు ఆమోదం



### హుస్సేన్‌సాగర్‌కు భారీ వరద..

## దిగువకు నీటి విడుదల

సిటీబ్యూరో, ఆగస్టు 17 (నమస్తే తెలంగాణ) : నగరంలో రెండు రోజుల పాటు కురిసిన వర్షాలకు హుస్సేన్‌సాగర్‌లోకి భారీగా వరద నీరు చేరింది. పూర్తి స్థాయి నీటి మట్టం 513.41 అడుగులు కాగా, శనివారం ఉదయం వరకు 513.53 వరకు చేరింది. దీంతో నీటిని దిగువకు వదిలారు. ప్రస్తుతం ఇన్‌ఫ్లో 2075 క్యూసెక్కులు ఉండగా, ఔట్‌ఫ్లో 1538 క్యూసెక్కుల నీటిని దిగవకు వదులుతున్నట్లు అధికారులు పేర్కొన్నారు.

GHMC

### బల్దియా టౌన్‌ప్లానింగ్‌లో

## బదిలీలు!

### సీపీ, ఏసీపీలకు స్థానచలనం

సిటీబ్యూరో: జీహెచ్ఎంసీ టౌన్ ప్లానింగ్ విభాగంలో సిటీ ప్లానర్స్, ఏసీపీలకు స్థానచలనం కల్పిస్తూ కమిషనర్ ఆమ్రపాలి ఉత్తర్వులు జారీ చేశారు. శేరిలింగంపల్లి జోన్ సిటీ ప్లానర్‌గా శ్యామ్, ఎల్బీనగర్ జోన్ సిటీ ప్లానర్‌గా శ్రీనివాస్ యాదవ్, చార్మినార్ జోన్ సీపీగా మాజీద్, కూకట్‌పల్లి సిటీ ప్లానర్‌గా గణపతి, ఖైరతాబాద్ ప్రధాన కార్యాలయంలోని చార్మినార్ సెక్టార్‌కు సిటీ ప్లానర్‌గా ఉమాదేవి, అడిషనల్ సీసీపీ వెంకన్నకు ప్రధాన కార్యాలయంలోని ఖైరతాబాద్ జోనల్ బాధ్యతలు అప్పగించారు. వీరితో పాటు పలువురు ఏసీపీల బదిలీలు జరిగాయి. చందానగర్‌కు నాగిరెడ్డి, జూబ్లీహిల్స్‌కు శ్రీనివాస్, మల్కాజిగిరికి శ్రీనివాసరావు, ఎల్బీనగర్‌కు ప్రతాప్, మలక్‌పేటకు గజానందం, చాంద్రాయణగుట్టకు భానుచందర్, ఫలక్‌నుమాకు మంజులాసింగ్, చార్మినార్‌కు రాందాస్, ముషీరాబాద్‌కు దేవేందర్, అంబర్‌పేటకు సుమిత్ర తదితర ఏసీపీలకు ఆయా స్థానాల్లో పోస్టింగ్‌లు ఇచ్చారు. అలాగే పలు చోట్ల టీపీఎస్‌లనూ మారుస్తూ.. నిర్ణయం తీసుకున్నారు. అలాగే 27 మంది అసిస్టెంట్ మెడికల్ ఆఫీసర్లకు కూడా స్థానచలనం కల్పిస్తూ కమిషనర్ ఆమ్రపాలి ఉత్తర్వులు జారీ చేశారు. వీరితో పాటు డిప్యూటీ ఈఈలను పలు సర్కిళ్లకు మార్చారు.


అల్వాల్ మండల కార్యాలయంలో కల్యాణలక్ష్మి, షాదీముబారక్ లబ్ధిదారులకు చెక్కులను అందజేస్తున్న ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి

## తులం బంగారమేది?

### కల్యాణలక్ష్మి చెక్కుల పంపిణీలో ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి

మల్కాజిగిరి, ఆగస్టు 17: కల్యాణలక్ష్మి చెక్కులు సరే.. మరి తులం బంగారమేది ? అని ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. శనివారం అల్వాల్ మండల కార్యాలయంలో 51 మంది కల్యాణలక్ష్మి, షాదీముబారక్ లబ్ధిదారులకు రూ. 51 లక్షల చెక్కులను ఆయన పంపిణీ చేశారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ ఎన్నికల ప్రచారంలో కల్యాణలక్ష్మి, షాదీముబారక్ పథకంలో భాగంగా రూ.1,00,116తో పాటు తులం బంగారం అందజేస్తామని ప్రసంగాల్లో ఊదరగొట్టిందన్నారు. ప్రభుత్వం వచ్చి తొమ్మిది నెలలవుతున్నా తులం బంగారం ఊసేలేదని విమర్శించారు. ప్రజలు నమ్మి ఓట్లు వేస్తే వారిని నట్టేట ముంచారన్నారు. చెక్కులు తీసుకున్న పేదింటి ఆడపడుచులు తులం బంగారమేదని ప్రశ్నిస్తున్నారన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం హామీని నెరవేర్చేవరకు పోరాడుతామన్నారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ విజయకుమార్, కార్పొరేటర్లు శాంతిశ్రీనివాస్‌రెడ్డి, సబితాకిశోర్, నాయకులు అంజయ్య, పరశురాంరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## మాటల్లోనే.. రుణ మాఫీ!

### నామ్‌కే వాస్తేగా.. గ్రీవెన్స్ సెల్..!

### దరఖాస్తుల స్వీకరణకే పరిమితం

రుణమాఫీ పొందని రైతుల నుంచి జిల్లా వ్యాప్తంగా 421 అర్జీలు

మేడ్చల్, ఆగస్టు 17 (నమస్తే తెలంగాణ)/దుండిగల్: రుణమాఫీ పథకం వర్తింపుకాని రైతులు గ్రీవెన్స్ సెల్‌లను ఆశ్రయిస్తున్నా.. ఫలితం ఉండటం లేదన్న విమర్శలు వస్తున్నాయి. గ్రీవెన్స్ సెల్స్ పేరుకే అన్నట్లు ఉన్నాయని, దరఖాస్తుల స్వీకరణే పరిమితమవుతున్నాయని పలువురు పేర్కొంటున్నారు. మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా వ్యాప్తంగా రుణమాఫీ పథకానికి సుమారు 30 వేల పైచిలుకు అర్హులుంటే రుణమాఫీ అయ్యింది మాత్రం 3,436 మందికే. దీంతో అర్హత ఉన్న రైతులందరూ గ్రీవెన్స్ సెల్‌లను ఆశ్రయిస్తున్నారు. జిల్లా వ్యాప్తంగా 25 గ్రీవెన్స్ సెల్‌లను ఏర్పాటు చేసినప్పటికీ దరఖాస్తుదారులకు సమాచారం ఇవ్వడమే తప్ప.. రుణమాఫీ పథకం వర్తింపుజేసేలా ప్రభుత్వం ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదని రైతులు ఆరోపిస్తున్నారు. గ్రీవెన్స్ సెల్‌లలో ఇప్పటి వరకు 421 దరఖాస్తులు వచ్చినట్లు అధికారుల ద్వారా తెలిసింది. రుణమాఫీ పథకం మూడు విడతలు పూర్తయిన నేపథ్యంలో గ్రీవెన్స్ సెల్‌లకు దరఖాస్తుల చేసుకునే రైతుల సంఖ్య మరింత పెరిగే అవకాశముందంటున్నారు.

#### ఆడిట్ పూర్తయినా..

జిల్లాలోని పూడూర్, ఘట్‌కేసర్, అల్వాల్ సహకార సంఘాల్లో ఇటీవలే ఆడిట్ పూర్తయినా.. ఇప్పటి వరకు అర్హులైన రుణమాఫీ కాలేదు. రుణమాఫీ పథకం ప్రకటించిన సమయంలో ఆడిట్ పూర్తికానందున మూడు సహకార సంఘాల గ్రామాలకు చెందిన రైతులకు రుణమాఫీ కాలేదని చెప్పి..తప్పించుకున్న ప్రభుత్వం.. తాజాగా ఆ ప్రక్రియ పూర్తయినా.. ఎందుకు రుణమాఫీ చేయడం లేదని అన్నదాతలు ప్రశ్నిస్తున్నారు. తమకు తక్షణమే రుణమాఫీ వర్తింపజేయాలని మూడు సహకార సంఘాల గ్రామాల పరిధి రైతులు డిమాండ్ చేస్తున్నారు.



గండిమైసమ్మ చౌరస్తాలోని బౌరంపేట్ సహకార సంఘం బ్యాంక్ వద్ద అధికారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే వివేకానంద్

### అసత్య ప్రచారం.. అబద్ధపు మాటలు

ఎమ్మెల్యే కేపీ వివేకానంద్

అసత్య ప్రచారం,అబద్ధపు మాటల పునాదులపై కాంగ్రెస్ పార్టీ గద్దెనెక్కిందని కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కేపీ వివేకానంద్ అన్నారు. గండిమైసమ్మ చౌరస్తాలోని బౌరంపేట్ సహకార సంఘం బ్యాంక్ వద్ద ప్రభుత్వం చేపట్టిన రుణమాఫీ విధానాలను నిరసిస్తూ బౌరంపేట్, దుండిగల్ గ్రామాలకు చెందిన రైతులు శనివారం నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు. ఎమ్మెల్యే వివేకానంద్ హాజరై మాట్లాడుతూ ఎన్నికల అనంతరం గతేడాది డిసెంబర్ 9లోపు రాష్ట్రంలోని రైతులందరికీ ఎలాంటి నిబంధనలు లేకుండా రుణమాఫీ చేస్తామని చెప్పి..కాంగ్రెస్ గద్దెనెక్కిందన్నారు.ప్రతి రైతుకు రూ.2 లక్షల చొప్పున రుణమాఫీ చేశామని చెబుతూ.. రైతాంగాన్ని నట్టేటా ముంచిందన్నారు. బౌరంపేట్, దుండిగల్ బ్యాంక్‌లో మొత్తం 632 మంది రైతులు రుణం పొందితే.. కేవలం14 మందికే రుణమాఫీ చేశారన్నారు. ఒక వేళ ప్రభుత్వం కొర్రీలు పెట్టి మిగతా రైతులకు రుణమాఫీ చేయకపోతే మోసపూరితంగా గద్దెనెక్కిన సీఎం రేవంత్‌రెడ్డి భేషరతుగా అన్నదాతలకు క్షమాపణ చెప్పి గద్దెదిగాలని డిమాండ్ చేశారు. ఈ నిరసనలో బౌరంపేట్ పీఏసీఎస్ చైర్మన్ విద్దెల బాల్‌రెడ్డి, వైస్ చైర్మన్ వెంకటేశ్, డైరెక్టర్లు భీమ్‌రెడ్డి, మహిపాల్‌రెడ్డి, సత్తిరెడ్డి, శ్రీనివాస్, రైతులు నర్సిరెడ్డి, శంకరయ్య తదితరులు పాల్గొన్నారు.